# విగ్రహ ప్రతిష్ఠ

కార్మికుల ఐక్యతా వర్ధిల్లాలి! యాజమాన్యం మొండి వైఖరీ నశించాలి! చట్టవిరుద్ధమైన లౌకౌట్ ఎత్తివేయాలి! ప్రపంచ కార్మికులారా ఏకంకండి!

ఇటువంటి నినాదాలతో ఆకాశం దద్దరిల్లిపోతోంది. మిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటించి నెల్లాళ్లయింది. మధ్యవర్తిత్వం నెరపిన లేబర్ ఆఫీసరు విఫలమయ్యారు. ఉత్పత్తి నిలిచిపోయింది. ఎగుమతులు స్తంభించిపోయాయి. కార్మికులకు జీతాలేవు. కాబూలీవాళ్లతో వాళ్లకి 'రుణా'నుబంధం ఎక్కువైంది.

యాజమాన్యానికీ, కార్మిక నాయకునికీ మధ్య ఎప్పుడైతే సంప్రదింపులలో స్తబ్దత ఏర్పడిందో, ఇహ సంప్రదింపులకి రాజధాని రమ్మని కార్మిక నాయకునికి టెలిగ్రామ్ వచ్చింది.

వెంటనే ఆయన రాజధాని బయలుదేరారు. అక్కడ కూడా సంప్రదింపులు విఫలమయ్యాయి.

ప్రమాదాలనేవి ఎప్పుడు, ఎలా, ఎక్కడ సంభవిస్తాయో ఎవరూ ఊహించలేరు. ముందుగా తెలిస్తే ఎవరు ప్రయాణం చేస్తారు?

రాజధాని నుండి తిరిగి వస్తున్నప్పుడు ఘోర విపత్తు సంభవించింది. కార్మిక నాయకుడు ప్రయాణిస్తున్న కారుని, ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. అక్కడికక్కడే కార్మిక నాయకుడు కకావికలైపోయి, 'అమరపురి'కి చేరుకున్నాడు. ఈ వార్త కార్మికులందరికీ తెలియగానే భోరుభోరున విలపించారు.

తమ ప్రియతమ నాయకుని కుటుంబాన్ని ఆదుకుందామా అంటే ఎవరి దగ్గరా చిల్లిగవ్వ లేదు.

మళ్లీ కాబూలీవాళ్లని ఆశ్రయించి, 'రుణా'నుబంధం పెంచుకుని కార్మిక నాయకుని కుటుంబాన్ని ఆదుకున్నారు. కానీ, రుణం తీర్చే మార్గం ఏదీ? రుణం తీర్చకపోతే దారుణం అయిపోదూ?

అంచేత ఎట్టి షరతులు లేకుండా డ్యూటీలో చేరిపోయారు. మిల్లు యంత్రాలు చకచకా నడిచాయి. చక్రాలు గిరగిరా తిరిగాయి.

మిల్లు యజమాని రాజధాని నుండి ఫ్లైట్‌లో వచ్చి, చనిపోయిన కార్మిక నాయకుని మృతికి సంతాపం ప్రకటించి, సభ ఏర్పాటు చేసి, అతని చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలనం కూడా చేశారు.

మరో రెండు నెలల్లో కార్మికుల కోసం ప్రాణాలర్పించిన ఆ కార్మిక నాయకుల విగ్రహ ప్రతిష్ఠాపన కూడా మిల్లు ఆవరణలోనే ఘనంగా ఏర్పాటు చేశారు. కార్మికులెంతగానో యజమాని ఔదార్యానికి మురిసిపోయారు.

"ఓ కార్మిక నాయకా! 'ప్రతిష్ఠ'కు ప్రాకులాడి, ఎవరు నన్ను ఢీకొందామనుకుంటే వారిని లారీ ఢీకొని, వారి 'విగ్రహ ప్రతిష్ఠ' జరుగుతూనే ఉంటుంది!" అని మిల్లు యజమాని తనలో తాను ఓ విషపు నవ్వు నవ్వుకుని రాజధానికి వెళ్లిపోయారు.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 13-3-2000